# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-04-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఎన్నికల ప్రచారంలో వినియోగించే హోర్డింగులపై ప్రింటర్, పబ్లిషర్ల వివరాలను తప్పక ముద్రించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.
- ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈరోజు పల్నాడు జిల్లాలో మేమంతా సిద్ధం యాత్ర లో పాల్గొన్నారు.
- ఇంటింటి ఎన్నికల ప్రచారానికి ప్రత్యేకంగా అనుమతులు అవసరం లేదని విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి స్పష్టం చేశారు.
- సముద్రంలో చేపల వేటను ఈ నెల 15వ తేదీ నుంచి రెండు నెలల పాటు నిషేధిస్తున్నట్టు రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ ఎ. సూర్యకుమారి తెలియజేశారు.

===================================

ఎన్నికల ప్రచారానికి సంబంధించిన అన్ని పత్రాలు, హోర్డింగుల పైనా ప్రింటర్, పబ్లిషర్ల వివరాలను తప్పనిసరిగా ముద్రించాలని కేంద్ర ఎన్నికల సంఘం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాలను ఆదేశించింది. మున్సిపల్ అధికారుల పరిధిలో ఉండే హోర్డింగులపై ప్రింటర్ లేదా పబ్లిషర్ గుర్తింపు లేకపోవడంపై కమిషన్‌కు పలు విజ్ఞప్తులు అందడంతో కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికార వర్గాలు తెలిపారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, డాక్టర్ సుఖ్ బీర్ సింగ్ సంధు లతో కూడిన కమిషన్ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

===================================

ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈరోజు పల్నాడు జిల్లాలో పర్యటించారు. పుట్టవారి పాలెం, రొంపిచర్ల క్రాస్, దేవరంపాడు మీదుగా మేమంతా సిద్ధం యాత్ర కొనసాగింది. కొండమోడు కూడలి వద్ద జరిగిన మేమంతా సిద్ధం కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. యాత్రలో

భాగంగా పలువురు ప్రజలు ఆయన్ను కలిసి విజ్ఞప్తులు అందజేశారు. ముఖ్యమంత్రి వారికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సముద్రంలో చేపల వేటను ఈ నెల 15వ తేదీ నుంచి నిషేధిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు మత్స్య శాఖ కమిషనర్ ఎ. సూర్యకుమారి ఈరోజు ఉత్తర్వులు జారీ చేస్తూ.... సముద్ర జలాల్లో యాంత్రిక పడవలు, మెకనైజ్డ్ మోటారు బోట్ల ద్వారా నిర్వహించే అన్నిరకాల మత్స్య సంపద వేటను రెండు నెలల పాటు నిషేధిస్తున్నట్టు పేర్కొన్నారు. వివిధ రకాల చేపలు, రొయ్యజాతులను వాటి సంతానోత్పత్తి కాలంలో సంరక్షించుకోవడం ద్వారా మత్స్య సంపద సుస్థిరతను సాధించవచ్చన్నారు. నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించిన బోట్ల యజమానులు శిక్షార్హులని స్పష్టం చేశారు. నిషేధ కాలంలో నిబంధనలు అమలు చేసేందుకు నిరంతరం గస్తీ ఏర్పాట్లు చేశామని కమిషనర్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పెట్రోలు బంకుల ద్వారా ఓటు హక్కుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా... చమురు పరిశ్రమల ప్రతినిధులను కోరారు. HPCL, IOCL, BPCL చమురు సంస్థల ప్రతినిధులతో ఈరోజు ఆయన... రాష్ట్ర సచివాలయంలో సమావేశమై ఓటర్ల అవగాహనా కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం (SVEEP) లో భాగంగా ఓటర్ల అవగాహనా కార్యక్రమాలను చమురు పరిశ్రమల ద్వారా కూడా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పటికే పోస్టల్ శాఖ ద్వారా ఓటర్ల అవగాహనా కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ECI లోగోతో ఎన్నికల తేదీని, ఓటు హక్కు విలువను తెలియజేసే నినాదాలతో హోర్డింగులను అందజేస్తామని, వాటిని అన్ని పెట్రోల్ బంకుల వద్ద ప్రదర్శించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాగా... సీఈవో ప్రతిపాదనలకు చమురు సంస్థల ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

స్వయంకృషితో అత్యున్నత పదవులను అధిరోహించిన మహాపురుషుడు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అని రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్ అన్నారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఈ నెల 14 వ తేదీ జరుగనున్న అంబేద్కర్ 133వ జయంతిని పురస్కరించుకుని ఈరోజు ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేటి యువత అంబేద్కర్ ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా అంబేద్కర్ జయంతిని జరుపుకోవచ్చునని జిఓ విడుదల కావడం సంతోషకరమని ఛైర్మన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇంటింటి ఎన్నికల ప్రచారం, కరపత్రాల పంపిణీకి సంబంధించి ప్రత్యేకంగా అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి స్పష్టం చేశారు. ఈరోజు విజయనగరంలో నిర్వహించిన రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ఎన్నికల కమిషన్ నుంచి తాజాగా వచ్చిన మార్గదర్శకాలను వివరించారు. రాజకీయ పార్టీల విజ్ఞప్తి మేరకు ఇంటింటి ప్రచారానికి, పాంప్లెట్ల పంపిణీకి అనుమతి తీసుకోవాలన్న నిబంధనను రద్దు చేసినట్టు తెలిపారు. అయితే ఎక్కడ సమావేశాలను, ర్యాలీలను నిర్వహించినా, సంబంధిత ఆర్ఓ నుంచి ముందుగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించడం జరుగుతుందని చిత్తూరు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎస్. షణ్మోహన్ తెలిపారు. ఈరోజు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన జిల్లా ఎస్పీ మణికంఠ, డి ఆర్ ఒ పుల్లయ్యలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జిల్లాలో ఎన్నికల విధులకు హాజరవుతున్న 12 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు మే 3 వ తేదీ నుండి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఈరోజు  పశ్చిమగోదావరి జిల్లా తణుకులో జరిగిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. తణుకు నగరం లో నరేంద్ర సెంటర్ లో జరిగిన సభా ప్రాంగణానికి చేరుకున్నారు. కాగా.. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కూడా ఇదే సభలో ఆయనతో వేదికను పంచుకున్నారు.  కార్యక్రమం అనంతరం చంద్రబాబు నాయుడు నిడదవోలుకు ప్రయాణమయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉపాధి హామీ పథకం కూలీల సంఖ్యను మరింత పెంచేలా చర్యలు తీసుకుంటామని అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు. రాప్తాడు, ప్రసన్నాయనపల్లి పంచాయతీ పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను ఈరోజు ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి, వారి ఓటు హక్కు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఈ నెల 14 వరకు అవకాశం ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వేసవి తాపాన్ని తట్టుకునేందుకు అవసరమైన సామగ్రిని శ్రీకాకుళం జిల్లా ఎస్పీ రాధిక ఈరోజు ట్రాఫిక్ పోలీసులకు అందజేశారు. స్థానిక   వరం  చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... వేసవి కాలంలో ట్రాఫిక్ పోలీసులకు ఎంతగానో ఉపయోగపడే వస్తు సామాగ్రిని అందజేయడం అభినందనీయమన్నారు. ట్రాఫిక్ సిబ్బంది ఎండ తీవ్రతను తట్టుకొని విధులు నిర్వహించడానికి ఈ సామగ్రి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొంటూ... వరం చారిటబుల్ ట్రస్టు సేవలను కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించేలా చర్యలు చేపడుతున్నట్టు పార్వతీపురం మున్సిపల్ కమీషనర్ కె. శ్రీనివాస్ తెలిపారు. తోటపల్లి రిజర్వాయర్ నుండి వచ్చే నీటిని ఊట బావుల వైపు మళ్ళించేందుకు చేసిన ప్రయత్నాల వల్ల నీటి రంగు మారిందని పేర్కొన్నారు. బావుల్లో పూడికలు తీయిస్తున్నామని  నీటిని క్లోరినేషన్ ద్వారా నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తున్నామని వివరించారు. రిజర్వాయర్ నుండి నీటిని మళ్ళించే పనులు పూర్తయ్యాక, బావుల నుండి నీటిని తోడి, బూస్టర్ పంపు హౌస్ వద్ద పూర్తి స్థాయిలో శుద్ధి చేసి, రక్షిత నీటిని ప్రజలకు అందిస్తామని  కమిషనర్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో మాస్టర్  ట్రైనర్ ల పాత్ర అత్యంత కీలకమని తూర్పు గోదావరి జిల్లా  కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్  కే. మాధవీలత అన్నారు. మాస్టర్ ట్రైనర్ లు అందచేసే సమాచారం, దిశా నిర్దేశం ద్వారా మాత్రమే ఎన్నికల విధుల్లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సహాయక సిబ్బంది పనితీరు ఆధార

పడుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 7 అసెంబ్లీ నియోజక వర్గ మాస్టర్ ట్రైనర్ లను ఒకే వేదికపై తీసుకుని వచ్చేలా ఏ ఎల్ ఎమ్ టి ల శిక్షణా కార్యక్రమం నిర్వహించడం ఒక మంచి అవకాశమని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రజాస్వామ్యం పరిడ విల్లాలంటే అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎం. హరి నారాయణన్ పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను చైతన్యపరిచేందుకు కావలిలోని రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ బూత్ ను ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ... ఓటు ప్రాధాన్యత పై అవగాహన కల్పించేందుకు ఈ సెల్ఫీ బూత్ ను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కు ముందు, పోలింగ్ రోజున సెక్టోరల్ అధికారుల పాత్ర చాలా కీలక మైఁదన్నారు. మే 13న పోలింగ్ రోజున ఉదయం చేపట్టే మాక్ పోల్ నుంచి చివరి ఓటు వేసే వరకూ సెక్టోరల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. కీలక మైఁదని

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. భీమవరంలో ఈరోజు జరిగిన నియోజకవర్గం ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణా కార్యక్రమంలో కలెక్టరు.... ఎన్నికల అధికారులకు హ్యాండ్ బుక్, మాన్యువల్, ఈవియంలపై శిక్షణ ఇచ్చారు. మాక్ పోల్ నిర్వహణ ప్రాధాన్యత, తదితర అంశాలను వివరించారు. ఈ సందర్బంగా కలెక్టరు మాట్లాడుతూ... పోలింగ్ ప్రక్రియకు సంబంధించి అవసరమైన అన్ని విషయాలను ప్రతి ఒక్కరు క్షుణంగా తెలుసుకోవాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాలు, నిబంధనల పుస్తకాలను సిబ్బంది చదవాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =